చంపాపేటలో దోమల దండయాత్ర

- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా చెత్తకుప్పలు, డ్రైనేజీలు
- నివారణ చర్యలపై అధికారుల నిర్లక్ష్యం

రక్తం పీల్చేస్తున్నాయ్!




సుల్తానాఅల్వా, గాయత్రినగర్‌ల్లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు

చంపాపేట: డివిజన్‌లోని పలు కాలనీల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా కాలనీలపై దండ యాత్రచేస్తూ జనం రక్తం పీల్చేస్తున్నాయి. దీంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నారు. రోజురోజుకూ మలక్‌పేట, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి, ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్యను చూస్తే పరిస్థితి ఇట్టే అర్థమవుతుంది.

- డివిజన్‌లో రెండు లక్షలకు పైగా జనాభా ఉన్నా.. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సర్కిల్ అధికారులు చేపడుతున్న చర్యలు మాత్రం నామమాత్రంగా ఉన్నాయని డివిజన్‌వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పూడిక తీతకు నోచుకోని డ్రైనేజీలు:
డివిజన్ పరిధిలోని యాదగిరినగర్ నుంచి ఎస్‌జీఆర్ కాలనీవరకు, సాయిరాంనగర్, దుర్గానగర్, అంజిరెడ్డి, రెడ్డి కాలనీ వంటి పలు కాలనీల్లోని ఓపెన్, భూగర్భ డ్రైనేజీలలో గత రెండేళ్లుగా పూడికతీతకు నోచుకోకపోవడంతో ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతూ దోమలకు ఆవాసాలుగా మారాయి.

రహదారులే చెత్త డంపింగ్ కేంద్రాలు:
డివిజన్‌లోని దుర్గాభవానీనగర్, కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని గాయత్రినగర్, సుల్తానా అల్వా, దాసరబస్తీ, కటికబస్తీ, హరిజనబస్తీ, మారుతీనగర్ వంటి కాలనీ రహదారుల పక్కన కొందరు స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ఆ చెత్త తరలింపునకు పారిశుద్ధ్య విభాగం అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి.

దోమల నివారణ చర్యలపై నిర్లక్ష్యం

- దోమల నివారణకు ఎంటమాలజీ విభాగ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, సాయంత్రం సమయాల్లో ఫాగింగ్ చేయాల్సిన యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోందని పలు కాలనీల ప్రజలు అంటున్నారు.
- ఫాగింగ్ సిబ్బంది చోటా, మోటా గల్లీ లీడర్లు, ప్రజాప్రతినిధుల ఇళ్ల పరిసరాల్లో ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఫాగింగ్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేయగా సర్కిల్ కార్యాలయంలో ఫాగింగ్ మిషన్లు కొన్ని మరమ్మతులకు నోచుకోక మూలన పడ్డాయని, కొద్దిపాటి మిషన్లతో సర్కిల్ పరిధిలోని 10 డివిజన్లలో ఏవిధంగా ఫాగింగ్ చేస్తామని వారు తమను ఎదురు ప్రశ్నిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాలాల పూడిక తీతతో పాటు రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలని డివిజన్ వాసులు కోరుతున్నారు.

క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి



రెండు నెలలుగా మా కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఒకపక్క మోడల్ మార్కెట్ రహదారిపై మురుగు పరుగు, పేరుకుపోయిన చెత్తకుప్పలు... మరోపక్క దోమలు, ఈగల స్వైర విహారంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– యాబీ ఆనంద్ నాయుడు, ప్రేమ్‌నగర్ కాలనీ

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్– 2లో ఆదివారం మమత ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్యులు శుభాష్, హజర్, దివ్య, సుష్మిత, కాలనీ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు మోహన్‌రెడ్డి, దిలీప్ రెడ్డి, రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం



డీఎస్ నకర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నేతలు

మలక్‌పేట: పెన్షనర్ల జీవన స్థితిగతులు మారడానికి డీఎస్ నకర చేసిన కృషి మరువలేనిదని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి అన్నారు. సలీంనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ నకర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి.. మాట్లాడుతూ ఆయన చేసిన కృషి వల్ల రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ దక్కిందన్నారు. ఒకటో తేదీన పెన్షన్ అందేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్,, కోశాధికారి ప్రసాద్‌రావు, వాసుదేవ్, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



బాక్స్‌టైప్ వరద నీటి కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ మల్‌రెడ్డి నగర్ కాలనీలో చేపట్టిన బాక్స్‌టైప్ వరద కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ...అధికారులు ఎన్నికల విధుల్లో ఉండటం వల్ల అభివృద్ధి పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. కాలువ ఏర్పాటుకు కాలనీలో కొంత మేర తవ్వకాలు జరిగాయని, కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాలా పనులను వేగవంతం చేయటంతో పాటు కాలనీలో ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పలు డివిజన్లలో పెండింగ్ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లా రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, రవిముదిరాజ్, తిరుమలేష్, యాదిరెడ్డి, నిశికాంత్‌రెడ్డి, జగదీష్‌గౌడ్, శివగౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వనస్థలిపురం: విద్యుత్ మరమ్మతుల కారణంగా బైరామల్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వనస్థలిపురం ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

- సాగర్ రింగ్ రోడ్డు, మాధవనగర్, అల్తాఫ్ నగర్, జానకి ఎన్‌క్లేవ్, భాగ్యనగర్, దుర్గానగర్, రెడ్డి కాలనీ, సాగర్ ఎన్‌క్లేవ్, శక్తి నగర్, రేడియో కాలనీ, అనురాధా కాలనీ, చింతలకుంట, బైరామల్‌గూడ, సరస్వతినగర్, మల్లికార్జుననగర్, యశోద నగర్, లింగోజిగూడ, మాధవరం, తపోవన్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 21, వంకాయ 45, బెండ 55, పచ్చిమిర్చి40, కాకర 55, బీర 60, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 28. దొండ 65, ఆలు 23, ఉల్లి 34, గోకర 50, దోస 28, సొర 15, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 70, అర్వి 45, మునగ 75, చిలగడదుంప 45, బీట్‌రూట్ 28, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 55.ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈ అమలులో ఉంటాయి.

డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్టీఆర్‌నగర్‌లో వాటర్ ట్యాంక్‌ను, కుళాయిని ప్రారంభిస్తున్న యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లోని 50 గజాల స్థలంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌కు బోర్ మోటార్‌తో పాటు కుళాయిలను ఆయన తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. కాలనీ వాసులతో కలిసి ఆదివారం వీటిని ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్ మూడేళ్లుగా నిరుపయోగం ఉందని, సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా తాను ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించినప్పుడు స్థానికులు వాటర్ ట్యాంక్ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఎన్నికలు పూర్తయ్యాక తాను సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని బస్తీవాసులకు ఇచ్చిన హామీ మేరకు తన సొంత నిధులతో కొత్త త్రి ఫేజ్ బోర్ మోటార్, వైరింగ్, కుళాయిలు ఏర్పాటు చేసి వాటర్ ట్యాంక్ ను ఉపయోగంలోకి తీసుకొచ్చానని చెప్పారు. కార్యక్రమంలో రేణుక, మమత, సంతోష, జయశ్రీ, రమాదేవి, లక్ష్మి, లావణ్య, కవిత, మాధవి, స్వరూప, రాజు నాయక్, విజయ్, భాస్కర్ నాయక్, శ్రావణ్, హరి నాయక్ పాల్గొన్నారు.

ఆర్‌కేపురం అభివృద్ధికి సహకరించండి



సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం ఎమ్మెల్యేగా మరోసారి గెలిచిన సబితారెడ్డిని ఆదివారం ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.శుభాకాంక్షలు తెలిపి గణేష్ చిత్రపటాన్ని బహూకరించారు. ఆర్‌కేపురం డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్, రమేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సింగరేణి డే వేడుకల బ్యానర్‌ను విడుదల చేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు

నాగోలు: సింగరేణి విశ్రాంత ఉద్యోగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆళవందార్ వేణు మాధవ్, సంయుక్త కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు అధికారులను కోరారు. ఆదివారం నాగోలు డివిజన్‌లోని లలితానగర్‌లో సింగరేణి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు ఈ నెల 23న నిర్వహించే సింగరేణి డే వేడుకల బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దాదాపు 30–40 సంవత్సరాలు సింగరేణి సంస్థ అభివృద్ధికి కష్టపడి పని చేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం–1998 ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి సమీక్షించి సవరించాలనే నిబంధన అమలు చేయడం లేదని, కనీస పెన్షన్ 15,000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం, సింగరేణి డే వేడుకలు, నూతన కమిటీ ఎన్నిక తదితర కార్యక్రమాలు నగరంలోని నాగోలు లలితానగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తామన్నారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గీస కనకయ్య, టి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌షిప్ పేరిట మోసం

- కరాటే మాస్టర్‌పై బాధితుల ఫిర్యాదు

సైదాబాద్: కరాటే చాంపియన్‌షిప్ పోటీల పేరిట డబ్బు వసూలు చేసి మోసగించిన కరాటే మాస్టర్‌పై బాధితులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సైదాబాద్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల మైదానంలో రాజునాయక్ అనే కరాటే మాస్టర్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. సెప్టెంబర్‌లో ముంబైలో కరాటే చాంపియన్‌షిప్ జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పాడు. ఇందులో పాల్గొంటే విద్యార్థులకు మంచి గుర్తింపు వస్తుందని నమ్మబలికాడు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు రూ. 22 వేలు చొప్పున చెల్లించాలని అన్నాడు. దీంతో కొందరు తల్లిదండ్రులు నగదు రూపంలో, మరికొందరు క్రెడిట్ కార్డు ద్వారా అతడికి చెల్లించారు. నెలలు గడుస్తున్నా పోటీల గురించి చెప్పకుండా కరాటే మాస్టర్ తప్పించుకొని తిరుగుతుండటంతో మోసపోయామని గుర్తించిన తల్లిదండ్రులు ఆదివారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలి

కాచిగూడ: రాబోయే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయని, అదంతా ఆ పార్టీల రాజకీయ నాటకమని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపైన చర్చించకుండా ఆధిపత్య రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. పార్లమెంట్‌లో బలమైన గళం వినిపించడానికి డాక్టర్ అంబేద్కర్ వాదులు పార్లమెంట్‌లో ప్రవేశిస్తేనే దళిత బహుజన జాతులకు సోషల్ జస్టిస్ జరుగుతుందన్నారు. తెలంగాణలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాలకు బలమైన ఎంపీ అభ్యర్థుల జాబితా సిద్ధం చేయాలని అన్నారు. పార్టీ నేతలు సి.యాదగిరి, వేదవృత్, బీరం సతీష్ కుమార్, దేవునూరి శ్రీనివాస్, దాసరి భాస్కర్, వరదా జ్యోతి, కొత్తపల్లి రాజేశ్వర్, శివసాయి తేజ పాల్గొన్నారు.

నారా నాగేశ్వరరావుకు డాక్టరేట్



నాగేశ్వరరావును అభినందిస్తున్న మంత్రి సీతక్క

చాదర్‌ఘాట్: తెలంగాణ వికలాంగుల సలహా మండలి సభ్యుడు నారా నాగేశ్వరరావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఓయూ మేనేజ్‌మెంట్ విభాగంలో సహ ఆచార్యుడైన డాక్టర్ జి.విద్యాసాగరరావు పర్యవేక్షణలో 'దివ్యాంగుల సాధికారత–కార్పొరేట్ సామాజిక బాధ్యత–ఎంచుకున్న కంపెనీలపై పరిశోధన' అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ అందుకున్న నాగేశ్వరరావును రాష్ట్ర మంత్రి సీతక్క అభినందించారు.

రామానుజన్ సేవలు అమోఘం



మ్యాథ్స్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: భారతదేశ గణిత శాస్త్ర అభివృద్ధికి నూతన అధ్యాయాన్ని కనుగొన్న మహనీయుడు శ్రీనివాస రామానుజన్ అని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి కొనియాడారు. ఘట్‌కేసర్, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, నల్లకుంట, గుర్రంగూడ, సుచిత్ర, అల్వాల్‌లో ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే రామానుజన్ గణితశాస్త్రం పట్ల చాలా దృష్టి వహించేవారని, అదే ఆసక్తిని క్రమక్రమేనా పెంపొందించుకున్నారన్నారు. పలు శాస్త్రవేత్తలు చేపట్టినటువంటి పరిశోధనలకు ఆకర్షితులై ప్రత్యేకంగా గణిత శాస్త్రంలో నూతన విషయాలకు బీజం వేశారన్నారు. అనంతరం రాష్ట్రంలోని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సుమారు 1200 మందికి పరీక్ష నిర్వహించామన్నారు.

ఎంసీఆర్ కాలనీ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

బడంగ్‌పేట: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎంసీఆర్ కాలనీ కమిటీ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయింది. అధ్యక్షునిగా వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నర్సింహా, కోశాధికారిగా హరినాయక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో మెరుగైన ఫలితాలు

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



పహాడీషరీఫ్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహద పడతాయని బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ షాహీన్‌నగర్‌లోని జామియా దారుల్ హుదా హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు బాల్యం నుంచే ప్రాక్టికల్స్ విద్యావిధానంపై అవగాహన కల్పించడం ద్వారా ఆలోచన శక్తిని పెంచినట్లవుతుందన్నారు. దాదాపు 150 మంది విద్యార్థులు ప్రదర్శనలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషూద్దీన్, మేరాజ్ ఖాన్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, సయ్యద్ ఫెరోజ్, మజ్హర్ అలీ, బర్కత్ అలీ, అలీ మసూరీ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్స్‌కు మరమ్మతులు చేపట్టండి

కాచిగూడ: కాచిగూడ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో చెడిపోయిన హ్యాండ్ బోర్స్, పవర్ బోర్‌వెల్స్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టిన ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జలమండలి అధికారులను కోరారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మోతీమార్కెట్, చెప్పల్‌బజార్, లింగంపల్లి, బాలప్పబాడ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించి పాడైన బోర్‌వెల్స్‌ను పరిశీలించారు.

సుందరీకరణకు మోక్షమెప్పుడో?



జల్‌పల్లి చెరువు

- అటకెక్కిన జల్‌పల్లి చెరువు అభివృద్ధి పనులు
- శీతకన్ను తగదంటున్న ప్రకృతి ప్రియులు
- అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాల పర్వం

పహాడీషరీఫ్: ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రకృతి సోయగాల నడుమ ఉన్న చెరువు పరిసరాలు వీక్షకుల చూపులను తిప్పనీయవు. అలాంటి అనుభూతి పొందాలనే లక్ష్యంతో జల్‌పల్లి పెద్ద చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం వాటి అభివృద్ధి పనులు అటకెక్కాయి. 150 ఎకరాల విస్తీర్ణంలో నిండు కుండలా ఉన్న ఇలాంటి చెరువు అందాలు చూడాలంటే నగరం దాటి ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జలపాతాల వద్ద కనిపిస్తుంటాయి. అధికారులు సూచించినట్లు సుందరీకరిస్తే చక్కటి పర్యాటక కేంద్రంగా విరజిల్లే అవకాశం ఉంది. రూ.9 కోట్ల వ్యయంతో చెరువు చుట్టూ వాకర్ల కోసం వాకింగ్ ట్రాక్, తటాకం మధ్యలో రెండుచోట్ల ఉన్న చిన్నపాటి గుట్టలను కూడా చక్కగా తీర్చిదిద్ది ఐలాండ్(ద్వీపం) చేయడం, ప్రమాదాలు జరగకుండా చుట్టూ ఇనుప కంచెతో పాటు చెరువు గట్టున ఉన్న గుట్టను రాక్ గార్డెన్‌గా, ప్రకృతి ప్రియుల కోసం బోట్ షికార్ సైతం ఏర్పాటు చేయాలని మొదటి నుంచి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతానికి కట్ట వైపు మాత్రం ఇనుప కంచె, విద్యుత్ సదుపాయాన్ని మాత్రమే ఇప్పటి వరకు పూర్తి చేశారు.

మిషన్ కాకతీయతో ఊరట
మిషన్ కాకతీయ పథకంలో భాగంగా 2016లో అప్పటి ప్రభుత్వం రూ.45 లక్షల వ్యయంతో చెరువు కట్ట పునరుద్ధరణ, అలుగును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసింది. ఆ ఏడాది నుంచే భారీ వర్షాలు కురవడంతో చెరువు పూర్తిగా నిండి అలుగు పారడం కూడా ప్రారంభమయ్యింది. నీరు సమృద్ధిగా చేరడంతో చేపల పెంపకందారులకు కూడా జీవనోపాధి కలిగింది. కానీ ఎఫ్‌టీఎల్‌లో నీరు ఖాళీ కావాలని భావించిన కొంత మంది స్థిరాస్తి వ్యాపారులు రెండు నెలల క్రితం చెరువు అలుగును కూడా ధ్వంసం చేశారు. ఎట్టకేలకు మేల్కొన్న నీటి పారుదల అధికారులు గండికి మళ్లీ మరమ్మతులు చేసి నీరు బయటికి వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

అసంపూర్తి కంచెతో తరచూ ప్రమాదాలు
జల్‌పల్లి పెద్ద చెరువుకు కంచె పూర్తి స్థాయిలో వేయని కారణంగా ఈత కొట్టేందుకు వచ్చే చిన్నారులు నీటమునిగి మృతి చెందుతున్న ఘటనలు తరుచూ జరుగుతున్నాయి. కట్టపై పూర్తిగా కంచె వేసినప్పటికీ.. మైసమ్మ ఆలయం వద్ద వినాయక ప్రతిమల నిమజ్జనం కోసం అధికారులు రెండుచోట్ల అడ్డును తొలగించారు. ఈ కారణంగా ఎంతో మంది ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందుతున్నారు. చెరువు చుట్టూ పూర్తి స్థాయిలో కంచె వేసినట్లయితే ప్రమాదాలకు చెక్ పెట్టే అవకాశం ఉంది.

శాంతి భద్రతలకు విఘాతం
చెరువు చుట్టూ విలువైన ప్రభుత్వ భూములు ఉండడంతో కబ్జారాయుళ్లు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ఒకే స్థలాన్ని ఒకరిని మించి మరొకరు కబ్జాలు చేస్తూ దాడులు, ప్రతి దాడులకు పాల్పడుతూ శాంతి భద్రతల సమస్యకు కారణమవుతున్నారు. సుందరీకరిస్తే పర్యాటకులతో ఈ ప్రాంతం ప్రత్యేకంగా మారుతుందనుకుంటున్న తరుణంలో కట్ట కింద 223 సర్వే నంబర్‌లో కబ్జాల పర్వం చూసి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జల్‌పల్లి కమాన్ రోడ్డులో కూడా చెరువు ఎఫ్‌టీఎల్‌లో కబ్జాల వ్యవహారం చర్చనీయాంశంగా మారుతోంది. ఇక రాత్రి పూట అసాంఘిక శక్తులు కూడా ఇక్కడ తిష్ట వేస్తున్నాయి.

మురికి కూపంగా తటాకం



నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలలోని చెరువులను సుందరీకంచి.. జల్‌పల్లి చెరువుపై శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. జిల్లెలగూడ చెరువు నిత్యం వాకర్లతో కళకళలాడుతోంది. అధికారుల ఉదాసీనత కారణంగా జల్‌పల్లి తటాకం మురికి కూపంగా మారుతోంది. హెచ్ఎండీఏ అధికారులు వెంటనే స్పందించి పనులను పూర్తి స్థాయిలో చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రమాదాలకు తావులేకుండా కంచెను ఏర్పాటు చేయాలి.

– శివ కుమార్, జల్‌పల్లి